గిరిజన విద్యార్థుల సమస్యలపై స్పందించండి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్
- కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన

-8లో

మన్యంలో మళ్లీ ముసురు



ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం

ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు

- పొంగుతున్న గెడ్డలు, వాగులు
- జనజీవనానికి అంతరాయం



అరకులోయలో వర్షం

పాడేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో మన్యంలో మంగళవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం నుంచే ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని వాతావరణం మారింది. అయితే జిల్లా కేంద్రం పాడేరులో మధ్యాహ్నం రెండు గంటల తర్వాత జల్లులతో కూడిన వర్షం కురవగా, ఇతర మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తాజా వర్షానికి జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడగా, మంగళవారం జి.మాడుగుల వారపు సంతకు వచ్చిన గిరిజనులు, వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. అలాగే పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే ఏజెన్సీ వ్యాప్తంగా ముసురు వాతావరణం కొనసాగుతున్నది.



పెదబయలులో వర్షం

అరకులోయ: మన్యంలో మళ్లీ ముసురు పట్టింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు వర్షం కురుస్తునే ఉంది. ఇటీవల 15 రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. మండలంలో అన్ని గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి.

పెదబయలు: కొద్ది రోజుల విరామం తర్వాత మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. తెల్లావారుజామున చిన్నపాటి చినుకులతో మొదలై రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. ఉదయం నుంచి కురిసిన వర్షం కారణంగా వరద నీరు మత్స్యగెడ్డ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ముంచంగిపుట్టు: మండల పరిధిలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా కురిసింది. వాగులు, వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రహదారులు అధ్వానంగా మారాయి. జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లోకి వరదనీరు ఇన్‌ఫ్లో పెరిగింది.

హుకుంపేట: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తునే ఉంది. రోడ్లు చిత్తడిగా మారాయి. ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. గతంలో వేసిన వరి నాట్లుకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు ఆనందపడుతున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పీలా గోవింద



ఖరారు చేసిన కూటమి నాయకులు

- నేడు అధికారికంగా ప్రకటన
- గెలుపునకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రణాళిక
- పర్యవేక్షణకు ముగ్గురు మంత్రులు, ఒక ఎంపీ
- ప్రాంతాల వారీగా బాధ్యతలు అప్పగింత
- వైసీపీ నుంచి భారీగానే వలసలు?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) స్థానానికి కూటమి అభ్యర్థిగా అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద పేరు ఖరారైనట్టు విశ్వసనీయంగా తెలిసింది. విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, అనకాపల్లి ఎంపీ సీటు ఆశించిన బైరి దిలీప్ చక్రవర్తి, ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, భీమిలి నియోజక వర్గానికి చెందిన కోరాడ రాజబాబు, తదితరులు పోటీకి ఉత్సాహం చూపించారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో నేతలు సుదీర్ఘంగా చర్చించి, ఆసక్తి చూపుతున్న వారందరి పేర్లు పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు పంపించారు. గండి బాబ్జీ మంగళవారం విజయవాడ వెళ్లి చంద్రబాబును కలిశారు. అన్నింటినీ పరిశీలించిన తరువాత పీలా గోవింద పేరు ఖరారు చేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా పార్టీ నాయకులకు యువ నేత, మంత్రి నారా లోకేశ్ కొన్ని సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను ఉమ్మడి విశాఖ ఎమ్మెల్సీ స్థానాన్ని కూటమి గెలుచుకొని తీరాలని స్పష్టంచేశారు. ఏ ప్రణాళిక వేసినా పక్కాగా ఉండాలని, ఎవరూ చేజారి పోకుండా చూసుకోవాలని సూచించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్‌లతో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ విశాఖలోనే ఉండి ఈ ఇరవై రోజులు పనిచేయాలని ఆదేశించారు. జిల్లాకు చెందిన మంత్రి వంగలపూడి అనిత కూడా ఈ ఎన్నిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇక్కడకు వచ్చే మంత్రులు ప్రాంతాల వారీగా బాధ్యతలు తీసుకొని పనిచేయనున్నట్టు సమాచారం. జీవీఎంసీ మొత్తం అచ్చెన్నాయుడు చూసుకుంటారని విశ్వసనీయంగా తెలిసింది. పాడేరు, అరకులోయ నియోజకవర్గాల ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యుల బాధ్యతను ఎంపీ సీఎం రమేశ్‌కు అప్పగించనున్నట్టు తెలిసింది.

నేడు అధికారికంగా అభ్యర్థి ప్రకటన

ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీలా గోవింద్ పేరును కూటమి నాయకత్వం బుధవారం ప్రకటించనుంది. అనేక మంది ఈ సీటు కోసం ప్రయత్నించినా అధిష్ఠానం గవర సామాజిక వర్గానికి చెందిన గోవింద్‌కే ఇవ్వాలని నిర్ణయించింది. వైసీపీ కాపు సామాజిక వర్గానికి చెందిన బొత్స సత్యనారాయణను రంగంలోకి దించినందున కూటమి అభ్యర్థి కూడా అదే సామాజికవర్గం అయితే బాగుంటుందని పలువురు పార్టీ పెద్దలకు సూచించారు.

అదేవిధంగా మాడుగుల, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గణబాబులు కూడా అభ్యర్థి ఎవరైతే బాగుంటుందో సీఎం చంద్రబాబును కలిసి వివరించారు. అందరి వాదనలు, అభిప్రాయాలు తెలుసుకున్న తరువాత గోవింద్ పేరు ... మిగతా 8వ పేజీలో

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకారం

- 30న పోలింగ్, సెప్టెంబరు 3న కౌంటింగ్

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం మంగళవారం జారీ చేసింది. ఈ నెల 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న వాటిని పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 16వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఈ నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది.

సెప్టెంబరు మూడో తేదీన ఓట్లను లెక్కించి ఎవరు ఎన్నికైనదీ ప్రకటిస్తారు. సెప్టెంబరు 6వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు.

సంపద సృష్టించని చెత్త కేంద్రాలు!

మన్యంలో నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

- నిర్మాణానికి వ్యయం చేసిన రూ.55 లక్షలు వృథా
- ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు



హుకుంపేట మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రం

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

పారిశుధ్యం మెరుగుతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యానికి ఏజెన్సీలో ఆదిలోనే తూట్లు పడ్డాయి. ఐదేళ్ల క్రితం చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో ఏజెన్సీలో ప్రతి మండల కేంద్రంలో రూ.5 లక్షల వ్యయంతో ఆయా కేంద్రాలను నిర్మించారు. మొత్తం 11 మండలాల్లోని కేంద్రాలకు రూ.55 లక్షలు వ్యయమైంది. కాని వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికార యంత్రాంగం కనీసం కృషి చేయలేదు. దీంతో ఆయా కేంద్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏజెన్సీలోని అన్ని మండల కేంద్రాల్లోనూ చెత్త సంపద కేంద్రాలను నిర్మించారు. మండల కేంద్రంలో పారిశుధ్య పనులు చేపట్టి, అందులో భాగంగా సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రంలో నిల్వ చేసి, అక్కడ ఆయా చెత్తను సేంద్రీయ ఎరువుల తయారీ చేయడం, ప్లాస్టిక్ బాటిళ్లను కూడబెట్టి విక్రయించడం, తదితర మార్గాల్లో ఆయా చెత్త నుంచి ఆదాయం పొందాలనేది అసలు లక్ష్యం. ఇందుకుగానూ ప్రతి మండల కేంద్రంలో రూ.5 లక్షలు చొప్పున వ్యయం చేసి భారీ రేకుల షెడ్, అందులో పలు రకాల చెత్తను నిల్వ చేసుకునేలా బెడ్‌ల నిర్మాణం చేపట్టారు.

కనీసం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ఐదేళ్ల క్రితం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. నిర్మించి ఉన్న కేంద్రాలను గ్రామ పంచాయతీల ద్వారా నిర్వహించుకున్నా పలు విధాలుగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కాని వాటిని వినియోగించుకోవాలనే ఆలోచనే ప్రభుత్వానికి లేకపోవడం, స్థానికంగా వాటిని వినియోగంలోకి తీసుకువద్దామనుకున్న పంచాయతీ సర్పంచులకు ప్రభుత్వం నుంచి కనీస ప్రోత్సాహం లేకుండా పోయింది. దీంతో సర్పంచులు సైతం వాటివైపు చూసేందుకు సాహసించలేదు. దీంతో ఏజెన్సీ వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు ఎక్కడికక్కడ నిరుపయోగంగా ఉండిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం పంచాయతీలు బలోపేతంతో పాటు పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటిస్తుండడంతో ఏజెన్సీలోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

1,500 హెక్టార్లలో సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం

- జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్



కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,500 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేపట్టేందుకు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ సేద్యాన్ని సంపూర్ణంగా ప్రోత్సహించేందుకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్నారు. అలాగే సూక్ష్మ సేద్యం చేపట్టే రైతులను ప్రోత్సహించేందుకు 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు, 55 శాతం రాయితీపై స్ప్రింక్లర్ పరికరాలు, 5 ఎకరాలు పైబడిన రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు, 45 శాతం రాయితీపై స్ప్రింక్లర్ పరికరాలు అందిస్తామన్నారు. సూక్ష్మ సేద్య పరికరాలు పొందాలనుకునే రైతులు తమ భూమి పట్టా, 1బి, బ్యాంకు పాస్, ఫోన్ నంబర్‌తో సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే తమకు అందుబాటులో ఉన్న వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల్ని సంప్రదించవచ్చునన్నారు. అలాగే ఏడేళ్ల క్రితం సూక్ష్మ సేద్య పరికరాలు పొందిన రైతులు కూడా అర్హులేనన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ఎం.రహీమ్ సెల్ నంబర్ 7995087036కు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

పాలకుల నిర్లక్ష్యం.. గిరిజనులకు శాపం

టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు గ్రామాలకు రోడ్లు మంజూరు

- మధ్యలోనే పనులు ఆపేసిన వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లలో మొదటికొచ్చిన పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న గిరిజనులు
- కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు

అరకులోయ, ఆగస్టు 6: పాలకుల నిర్లక్ష్యం గిరిజనుల పాలిట శాపంగా మారింది. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కొనసాగించకపోవడంతో గిరిజనం ఇబ్బంది పడుతోంది.



మొర్రిగుడ-అంటిపర్తి రహదారిలో బ్లాస్టింగ్ చేసి సీసీ రోడ్డు వేయకుండా వదిలేసిన దృశ్యం



జయంతివలస-బొండాం కొత్తవలస మధ్య తారు రోడ్డు పనులు నిలిచిపోవడంతో తేలిన కంకర

మండలంలోని మారుమూల గ్రామాలకు రహదారులు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మండలంలో పలు రోడ్లకు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని మధ్యలోనే నిలిపివేసింది. ఐదేళ్లుగా పనులు నిలిపివేయడంతో వర్షాలకు మట్టి రోడ్లు కోతకు గురై మొదటికొచ్చాయి. దీంతో రహదారులు లేక ఆయా ప్రాంతాల ప్రజానీకం నిత్యం అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి ... మిగతా 8వ పేజీలో

వైద్యులకు వసతి సమస్య తీరేదెన్నడో?

నిధులు విడుదల చేయని వైసీపీ ప్రభుత్వం

- ఐదేళ్లుగా నిలిచిన నిర్మాణాలు
- చింతపల్లిలో అద్దె ఇళ్లు లభించక వైద్యుల అవస్థలు
- మెజారిటీ వైద్యులు నర్సీపట్నం నుంచి రాకపోకలు

చింతపల్లి, ఆగస్టు 6: చింతపల్లిలో వైద్యుల నివాస గృహాల నిర్మాణం కలగానే మిగిలిపోయింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంగా నిధులు విడుదల చేయకపోవడంతో అవి నేటికీ అందుబాటులోకి రాలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్మాణాలే ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..

వైద్యులు స్థానిక ఉండాలంటే నివాస గృహాలు అందుబాటులో ఉండాలని భావించిన టీడీపీ ప్రభుత్వం 2018లో ఐటీడీఏ ద్వారా చింతపల్లిలో వసతి గృహాల నిర్మాణానికి రూ.70లక్షలను మంజూరు చేసింది. అదే ఏడాది కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. 2019 ఫిబ్రవరిలో టీడీపీ ప్రభుత్వం పునాదుల బిల్లు రూ.13లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ 2019 నవంబరు నాటికి రెండు అంతస్తులు శ్లాబ్ వేశాడు. అయితే రెండో విడత బిల్లు రూ.18 లక్షలను వైసీపీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో 2019 ఆఖరు నుంచి కాంట్రాక్టర్ నిర్మాణాలను నిలిపివేశాడు. రెండేళ్ల నిరీక్షణ అనంతరం ప్రభుత్వం 2021 ఏప్రిల్‌లో వసతి గృహ సముదాయం నిర్మాణాలకు సంబంధించిన బకాయి రూ.18లక్షలను మంజూరు చేసింది. అయితే రెండో విడత బిల్లులు చెల్లించేందుకు రెండేళ్ల సమయం పట్టిందని, నిర్మాణాలు పూర్తిచేసినా బిల్లులు వస్తాయో? రావోననే సందేహంతో నిర్మాణాలు కొనసాగించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. అసంపూర్తి వైద్యుల వసతి గృహం అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా మారింది. ప్రతి రోజూ సాయంత్రం మందుబాబులు ఈ భవనం వద్దకు చేరుకుని మద్యం సేవిస్తున్నారు. దీంతో భవనం చుట్టూ ... మిగతా 8వ పేజీలో



చింతపల్లిలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న వైద్యుల క్వార్టర్స్

విశ్వ క్రీడా వేదికపై నేడు విశాఖ యువతి ప్రదర్శన

- పారిస్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌పై ఎర్రాజీ జ్యోతి
- 100 మీటర్ల హర్డిల్స్ తొలి రౌండ్ హీట్స్‌కు సన్నద్ధం
- మధ్యాహ్నం 1.55 గంటలకు రేస్ ప్రారంభం
- బలమైన ప్రత్యర్థులతో పోటీ
- ఫైనల్స్‌కు చేరడంపై ఆశాభావం

-7లో



క్రైం... crime news

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

కొత్తూరు, ఆగస్టు 6: మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి మృతి చెందాడని అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.భాస్కరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన రాపేటి సత్యనారాయణ(69) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మనస్తాపం చెంది పశువుల పాకలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన అతని కుటుంబ సభ్యులు వెంటనే అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. అయితే సమయం తక్కువగా ఉండడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ రాత్రి 10 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులకు గాయాలు

చీడికాడ, ఆగస్టు 6: మండలంలోని బైలపూడి సచివాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చోడవరం నుంచి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ యశ్వంత్ కుమార్, ఇంజినీర్ అసిస్టెంట్ మంజూష బైక్‌పై బైలపూడి వస్తుండగా వరహాపురం వద్ద అడ్డంగా కుక్క రావడంతో పడిపోయారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో వరాహాపురంలో ఆర్‌ఎంపీ డాక్టర్ ప్రథమ చికిత్స చేశారు.

పేకాట శిబిరంపై దాడి

» 11 మంది అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 6: మండలంలోని నామవరం గ్రామ శివారులో సోమవారం సాయంత్రం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. వారి నుంచి సుమారు రూ.38,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

అవయవదానంతో ఏడుగురికి పునర్జన్మ

మత్స్యకార మహిళ బెయిన్ డెడ్ కావడంతో

అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు



అవయవదానం చేసిన అడివరం

అచ్యుతాపురం, ఆగస్టు 6: బ్రెయిన్ డెడ్ అయిన ఒక మత్స్యకార మహిళ అవయవ దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో మంగళవారం షీలానగర్‌లో గల కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో అవయవ దానం చేశారు.

మండలంలోని పూడిమడకకు చెందిన యజ్జల అడివరం (38) ఈనెల మూడు రాత్రి హైబీపీతో ఇంటి వద్ద పడిపోయింది. తొలుత ఆమెకు అనకాపల్లిలో ఒక ప్రవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో విశాఖ షీలానగర్‌లో గల కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ డాక్టర్లు పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ డెడ్ అయిందని ఈనెల ఐదో తేదీ మధ్యాహ్నం తెలిపారు. అయితే అవయవ దానం చేస్తే ఏడుగురికి ప్రాణదానం చేసినట్టవుతుందని వైద్యులతో పాటు జీవదాన్ ట్రస్టు సభ్యులు అడివరం కుటుంబ సభ్యులకు వివరించారు. కుటుంబ సభ్యులు అంగీకరించడంతో మంగళవారం ఉదయం అవయవదానం అనంతరం పూడిమడకలో అంత్యక్రియలు జరిపారు.

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

» విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 6: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని నోడల్ అధికారులను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ న ఈఎన్నిక జరగనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్ సమా వేశ మందిరంలో రెవెన్యూ, పోలీసు, ఇతర విభాగాల అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ ఎన్నికల్లో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన కూడళ్లలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచి తనిఖీలు కొనసాగించాలని ఆదేశించారు. ఎన్నిక సజావుగా సాగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అలాగే, పలు అంశాలపై మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రజా ప్రతినిధుల అనుమ తులకు సంబంధించి కలెక్టరేట్‌లో సింగిల్ విండో విధానం అందుబాటులోకి తీసుకురావాలని, జిల్లా పరిధి రాజకీయ విగ్రహాలకు ముసు గులు వేయాలని, పోస్టర్లు తొలగించాలని సూచించారు. అనుమతులు లేకుండా రాజకీయ సమావేశాలు, ర్యాలీలు జరపడానికి వీలు లేదన్నారు. ఎంసీసీ కమిటీలు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. పత్రికలు, టీవీలలో వార్తా కథనాలను పర్యవేక్షించాలన్నారు. ప్రక టనలకు సార్వత్రిక ఎన్నికలో మాదిరిగానే ఎంసీఎంసీ నుంచి అ నుమతులు తీసుకోవాలని కోరారు. నిబంధనలు కచ్చితంగా పాటించి సహకరించాలని వివిధ రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేసీ మయూరి అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కమార్ , జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీఆర్‌వో, ఆర్‌డీవో తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో విశాఖకు ఒకే ఒక్క పరిశ్రమ

» లోక్‌సభలో ఎంపీ శ్రీభరత్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), ఆగస్టు 6: విశాఖకు గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం ఒకే ఒక్క పరిశ్రమ వచ్చిందని లోక్‌సభలో మంగళవారం ప్రస్తుత ఎంపీ ఎం.శ్రీభరత్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. దివీస్ లేబొరేటరీస్ ఈవోయూ విభాగం 2021-22లో బల్క్ డ్రగ్, ఫార్మాస్యూటికల్స్ రంగంలో ఉత్పత్తిని ప్రారంభించిందని, అది మినహా కొత్త పరిశ్రమలేవీ విశాఖ జిల్లాకు రాలేదని మంత్రి వెల్లడించారు. కాగా రాష్ట్రంలో కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు విరివిగా చేయించాల్సిన పరిస్థితి ఉందని కేంద్రానికి ఎంపీ ఎం.శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లలో దేశంలో కేన్సర్ కేసులు 13 శాతం పెరిగాయని, 2025 నాటికి 1.57 మిలియన్ కేసులు నమోదయ్యే అవకాశం ఉందని పరిశోధన సంస్థలు చెబుతున్నాయన్నారు. ఇలాంటి ప్రమాదకర వ్యాధులను ముందస్తుగా గుర్తించడం వల్ల ఎక్కువ మంది ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. అమెరికాతో పోలిస్తే మనదేశంలో స్క్రీనింగ్ రేటు చాలా తక్కువగా ఉందని అన్నారు. పరీక్షలు చేయించడం, కేన్సర్ పరిశోధనలకు మరిన్ని నిధులు కేటాయించడం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కేన్సర్ గుర్తింపు, ఇతర చికిత్సల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పక్కాగా ఏర్పాట్లు

విశాఖపట్నం, ఆగస్టు 6: జిల్లాలో ఈ నెల 23 నుంచి సెప్టెంబరు 5 వతేదీ వరకు జరుగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పక్కా ఏ ర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఆర్మీ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అక్కయపాలెం పోర్టు ట్రస్టు డైమండ్ జూబ్లీ స్టేడియంలో నిర్వహించనున్న ఆర్మీ ర్యాలీలో రాష్ట్రంలో 13 జిల్లాలకు చెందిన 8 వేల మంది యువత పాల్గొననున్నారన్నారు. ఈ ర్యాలీ సాఫీగా జరిగేందుకు జిల్లా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఏర్పాట్ల సమన్వయం కోసం సెట్విజ్ సీఈవో డి. కీర్తి, డీఎస్‌డీవో జాన్ గ్యాలియట్‌లను నోడల్ అధికారులకుగా నియమించనున్నట్టు తెలిపారు. ర్యాలీ జరుగుతున్న సమయంలో స్టేడియం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చే యాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. ఆర్మీ అధికారులతో జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పనిచేసేందుకు ఓ సీనియర్ అధికారిని నియమించాలని ఆదేశించారు. అభ్యర్థులు వేచి ఉండేందుకు, వైద్య పరీక్షలు, రిజిస్ట్రేషన్లకు ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. రెండు అంబులెన్స్‌లతోపాటు అవసరమైన వైద్యులు, సిబ్బంది మందులతోపాటు సమీప ఆసుపత్రిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

విశ్వ క్రీడా వేదికపై

నేడు విశాఖ యువతి ప్రదర్శన

పారిస్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌పై ఎర్రాజీ జ్యోతి

100 మీటర్ల హర్డిల్స్ తొలి రౌండ్ హీట్స్‌కు సన్నద్ధం

మధ్యాహ్నం 1.55 గంటలకు రేస్ ప్రారంభం..

బలమైన ప్రత్యర్థులతో పోటీ

ఫైనల్స్‌కు చేరడంపై ఆశాభావం



విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 6: విశాఖకు చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి బుధవారం ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పరుగు తీయనున్నది. 100 మీటర్ల హర్డిల్స్‌లో భారత్ సత్తా చాటేందుకు సన్నద్ధమవుతోంది. ఒలింపిక్స్‌లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తొలి మహిళా 100 మీటర్ల హర్డలర్‌గా జ్యోతి రికార్డు నెలకొల్పింది. తాను నెలకొల్పిన జాతీయ రికార్డులను తిరగరాసుకుంటూ ఫాస్టెస్ట్ రేసర్‌గా గుర్తింపుపొందిన ఎర్రాజీ జ్యోతి..విశ్వ క్రీడల్లో కూడా తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతోంది.

క్రీడాభిమానులలో ఆకాంక్ష

ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించిన జ్యోతి..ర్యాంకింగ్ ఆధారంగా ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ప్రపంచవ్యాప్తంగా సమ్మర్ ఒలింపిక్స్‌కు ర్యాంకింగ్ ఆధారంగా 40 మంది అర్హత సాధించగా, ఎర్రాజీ జ్యోతి 34వ ర్యాంకుతో ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లోకి ప్రవేశించింది. ఒలింపిక్స్‌కు ముందు జరిగిన సీజన్ మీట్‌లో 12.78 సెకన్ల అత్యుత్తమ టైమింగ్‌తో రేస్‌ను పూర్తిచేసిన జ్యోతి..బుధవారం జరిగే తొలి రౌండ్ హీట్స్‌లో బలమైన ప్రత్యర్థులతో పోటీపడబోతున్నది.

విశాఖకు గర్వకారణం

అత్యంత సాధారణ కుటుంబం నుంచి అథ్లెట్‌గా కెరీర్ ప్రారంభించిన జ్యోతి నేడు ఒలింపిక్స్‌లో పాల్గొననుండడం విశేషం. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో సాధన కొనసాగించింది. అనతికాలంలోనే 100 మీటర్ల హర్డిల్స్‌లో టాప్ అథ్లెట్‌గా ఎదిగింది. అంతర్జాతీయ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో తాను ప్రాతినిధ్యం వహించిన ప్రతి మీట్‌లో దేశానికి పతకాలు అందించింది. భారత అథ్లెటిక్స్ రంగంలో అత్యంత వేగవంతమైన హర్డిలర్‌గా ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరిన ఎర్రాజీ జ్యోతి విశాఖ వాసి కావడం నగరవాసులందరికీ గర్వకారణం.

హర్డిల్స్ షెడ్యూల్

100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్ బుధవారం మొదటి రౌండ్ హీట్స్‌తో ప్రారంభమైంది. గురువారం రిపిచేజ్ రౌండ్, శుక్రవారం (9న) సెమీ ఫైనల్స్, శనివారం (10న) ఫైనల్ రేస్ జరుగుతుంది.

ఫైనల్స్‌కు చేరే అవకాశాలు ఉన్నాయి

అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు



ఆమెకు ఒలింపిక్స్‌లో పతకం సాధించే సత్తా ఉంది. ఆసియా క్రీడల్లో పతకం సాధించిన నేపథ్యంలో ఆమెపై అంచనాలు పెరిగాయి. నెలకొల్పిన జాతీయ రికార్డులు, సాధించిన అంతర్జాతీయ పతకాలు ఆమెలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. పారిస్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో బుధవారం జరిగే తొలి రౌండ్ హీట్స్‌లో క్వాలిఫై అవుతుందనే నమ్మకం ఉంది. అలాగే ఫైనల్స్‌కు చేరే అవకాశాలున్నాయి.

‘పేట’ మెయిన్‌రోడ్డు ఆక్రమణదారులకు నోటీసులు

» ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాయకరావుపేట, ఆగస్టు 6: పాయకరావుపేట మెయిన్‌రోడ్డును ఆక్రమించినవారికి నోటీసులు జారీ చేయనున్నామని ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ‘పేట’లో ఆక్రమణలు’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’లో ఇటీవల ప్రచురితమైన కథనంపై స్పందించిన డీపీవో శిరీషారాణి వెంటనే చర్యలు తీసుకోవాలని పాయకరావుపేట పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట మెయిన్‌రోడ్డును ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పాయకరావుపేట మెయిన్ రోడ్డును ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు, ఇతర ఆక్రమ కట్టడాలను గుర్తిస్తున్నామన్నారు. వీరందరికీ త్వరలో నోటీసులు జారీచేయనున్నామని, ఆక్రమణలు తొలగించకుంటే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ గుమస్తా వరహాలు తదితరులున్నారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట షాపులను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్

500 హెక్టార్లలో టేకు సాగు

» అటవీ శాఖ సీసీఎఫ్ శ్రీకంఠనాథ్ రెడ్డి

గొలుగొండ, ఆగస్టు 6: ఈ ఏడాది ఐదు వందల హెక్టార్లలో టేకు ప్లాంటేషన్లు సాగు చేపట్టామని విశాఖపట్నం అటవీ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ (సీసీఎఫ్) శ్రీకంఠనాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని పాతమల్లంపేట శివారు అచ్చియ్యపేటలో టేకు ప్లాంటేషన్‌తోపాటు ధారమఠం ఫారెస్ట్, గొలుగొండలో టేకు కలప డిపోలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది 611 హెక్టార్లలో టేకు ప్లాంటేషన్లు ఏర్పాటు చేసేందుకు లక్ష్యం కాగా 500 హెక్టార్లలో టేకు ప్లాంటేషన్లు ఏర్పాటు చేశామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8.23 కోట్ల ఆదాయం టేకు కలప వేలం పాటల ద్వారా ప్రభుత్వానికి వచ్చిందన్నారు. సీపీజ్ ద్వారా రూ.80లక్షల ఆదాయం వచ్చిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి గొలుగొండ, కాకారపాడు, చిలకలగెడ్డ డిపోల్లో టేకు వేలం పాటల ద్వారా రూ.రెండు కోట్లు ఆదాయం ప్రభుత్వానికి సమకూరినట్టు శ్రీకంఠనాథ్ రెడ్డి తెలిపారు. కరక, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం ఫారెస్ట్ భూముల్లో గల రంగురాళ్ల క్వారీల వద్ద అక్రమ తవ్వకాల నియంత్రణకు నిరంతరం పెట్రోలింగ్‌తోపాటు, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. సీసీఎఫ్ వెంట నర్సీపట్నం డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, సబ్‌డీఎఫ్‌వో సునీల్‌కుమార్, ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్‌రవుఫ్, కృష్ణాదేవిపేట రేంజర్ వెంకటరమణ, పి. లక్ష్మినర్సు, గొలుగొండ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



గొలుగొండ కలప డిపోలో టేకును పరిశీలిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథ్ రెడ్డి

తాండవ కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు

» డీఈఈ అనురాధ

నాతవరం, ఆగస్టు 6 : తాండవ కుడి,ఎడమ కాలువల మరమ్మతులు, మెయిన్ గేట్లు లీకేజీలు, తదితర పనుల కోసం కోటి 80 లక్షల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తాండవ రిజర్వాయర్ డీఈఈ అనురాధ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి గాంధీనగరం వద్ద తాండవ ఎడమ కాలువ వెల్ సైఫాన్ వద్ద సాగునీటి లీకేజీని పరిశీలించారు. అలాగే అండర్ టన్నెల్ దగ్గర నీటి వృథా కాకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఆగస్టు మూడో వారంలో తాండవ నీరు విడుదల చేసినప్పుడు చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందేలా యుద్ధప్రాతిపదిక పనులు చేస్తున్నట్టు డీఈఈ అనురాధ చెప్పారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తాండవ కాలువల తక్షణ మరమ్మతులకు రూ.ఐదు లక్షలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. అధికారులు అలసత్వం వహించకుండా దగ్గరుండి తక్షణ మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొళెం రామ్‌ప్రసాద్, స్వామి, పోలుపర్తి సాయి, అంకంరెడ్డి వరహాలదొర, అప్పారావు, తాండవ ఏఈ శ్యామ్ పాల్గొన్నారు.



గాంధీనగరం వద్ద తాండవ ఎడమ కాలువ వెల్ సైఫాన్‌ను పరిశీలిస్తున్న డీఈఈ అనురాధ, టీడీపీ నాయకులు

సింహాచలం ఘాట్‌రోడ్డులో వ్యూ పాయింట్

ఆహ్లాదం పంచేలా నిర్మాణానికి శ్రీకారం

సింహాచలం, ఆగస్టు 6: సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదాన్ని పంచే దిశగా సింహగిరి ఘాట్‌రోడ్డులో వ్యూ పాయింట్ రూపుదిద్దుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రసాద్ పథకంలో భాగంగా మంజూరైన రూ.54.4 కోట్ల నిధులతో దేవస్థానం పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పాత, కొత్త ఘాట్‌రోడ్లు కలిసే వై జంక్షన్‌లో సుమారు రూ.20 లక్షలు వెచ్చించి పర్యాటకశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ రమణ సారథ్యంలో వ్యూ పాయింట్ నిర్మాణం చేపడుతున్నారు. భక్తులు ఎండా, వానల్లో సేద దీరేందుకు అనుకూలంగా పైకప్పు, చుట్టూ ఎటుచూసినా ఆహ్లాదకరంగా పచ్చదనం కనిపించేలా అధికారులు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతానికి నిర్మాణం దాదాపు 70 శాతానికి పైగా పూర్తయింది. మరో సుమారు రూ.20లక్షల వ్యయంతో సింహగిరి మెట్లమార్గంలోనూ భక్తులు సేదదీరేందుకు అనుకూలంగా రెస్టింగ్ పాయింట్ పేరుతో నిర్మాణాన్ని త్వరలోనే ప్రసాద్ పథకంలో భాగంగానే చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఈఈ రమణ తెలిపారు. ఇందులో భక్తులు కూర్చునేందుకు వీలుగా వసతి, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయనున్నట్టు ఆయన వివరించారు.



నిర్మాణానంతరం ఇలా ఉంటుంది (ఊహాచిత్రం)

అనుమతుల్లేని ఆస్పత్రులపై చర్యలేవీ?

» వైద్య ఆరోగ్యశాఖాధికారుల తీరుపై విమర్శలు

అచ్యుతాపురం, ఆగస్టు 6: అచ్యుతాపురంలో అనుమతుల్లేని ఆస్పత్రులు అధిక సంఖ్యలో ఉన్నా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చాలా వరకు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు లేని వైద్యులు పని చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నర్సింగ్ సిబ్బంది కూడా ఎటువంటి అర్హత లేనివారే పనిచేస్తున్నారని తెలిసింది. దీనివల్ల రోగులకు పక్కాగా వైద్య సేవలు అందవని పలువురు అంటున్నారు. ఇటువంటి వైద్యుల వల్ల రోగుల ప్రాణాలకు ప్రమాదమని పలువురు హెచ్చరిస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖాధికారులు స్పందించి ఆస్పత్రులను తనిఖీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

» స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు వినతి



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ గురుకుల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

నర్సీపట్నం, ఆగస్టు 6: బాయ్స్ హాస్టల్స్‌లో పురుషులు, గర్ల్స్ హాస్టల్స్‌లో మహిళా ఉద్యోగులు మాత్రమే పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నర్సీపట్నం అంబేడ్కర్ గురుకుల ఉద్యోగులు జీవీ భాస్కరరావు, ఎం ఉమాదేవి కోరారు. ఈ మేరకు మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని గురుకుల పాఠశాలలో పురుషులు, మహిళలు కలిపి 80 మంది పొరుగు సేవలో పని చేస్తున్నామని తెలిపారు. బాలికల వసతి గృహాల్లో మహిళలు, బాలుర వసతి గృహాల్లో పురుషులు ఉద్యోగం చేయాలని నిబంధన పెట్టడం వల్ల 34 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. ఇక్కడ ఉపాధి కోల్పోతున్న ఉద్యోగులను పక్క జిల్లాల్లో సర్దుబాటు చేస్తామని అంటున్నారని, తక్కువ జీతంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆర్థిక భారం తప్పదని అన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఉపాధి కోల్పోతున్న వారికి స్థానికంగా ఏదైనా ప్రభుత్వ కార్యాలయాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

108లో గర్భిణి ప్రసవం

» తల్లీబిడ్డ క్షేమం



108 అంబులెన్స్‌లో ప్రసవించిన బిడ్డ

నాతవరం, ఆగస్టు 6: మండలంలో 108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రస వించింది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు సంతోషపడుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వల్లంపేట శివారు ఊటమళ్ల గిరిజన గ్రామంలో సౌమ్యశ్రీ అనే గర్భిణికి పురిటి నొప్పులు రావ డంతో ఆశ కార్యకర్త లక్ష్మి 108 అంబులెన్స్‌లో నాతవరం పీహెచ్‌సీకి తరలిస్తున్నారు. మార్గమధ్యంలో సౌమ్యశ్రీకు నొప్పులు అధికంగా కావడంతో వాహనానికి రోడ్డు పక్కన ఆపి ఆశ కార్యకర్త సాయంతో 108 ఈఎంటీ ఎస్.ప్రసాద్, పైలట్ ప్రసాద్ డెలివరీ చేయించారు. అనంతరం తల్లీ,బిడ్డలను నాతవరం పీహెచ్‌సీకి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు సంతోషపడ్డారు.

కల్యాణపులోవ నీరు విడుదల



కల్యాణపులోవ రిజర్వాయర్ నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు, రైతులు

రావికమతం, ఆగస్టు 6: ఖరీఫ్ సాగుకు కల్యాణపులోవ ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందించాలని ఇరిగేషన్ ఈఈ జె.స్వామినాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద పూజలు చేసిన అనంతరం ఈఈ స్వామినాయుడు, రైతులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ, ఈ ఏడాది రిజర్వాయర్‌లో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ ఆయకట్టు దిగువ ప్రాంతంలో వర్షాలు ఆశించిన స్థాయిలో పడలేదన్నారు. రిజర్వాయర్ 460 అడుగుల సామర్థ్యం కాగా ప్రస్తుతం 459 అడుగుల మేర నీటినిల్వలు ఉన్నాయన్నారు. తొమ్మిది పంచాయతీల పరిధిలో 15 గ్రామాలకు చెందిన 44,780 ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జేఈఈ సత్యనారాయణదొర రైతులు పాల్గొన్నారు.

ట్రాలర్ ట్రక్‌పై పాత విమానం



ట్రాలర్ ట్రక్‌పై పాత విమానాన్ని తరలిస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఆగస్టు 6: నక్కపల్లి హైవేపై ఓ ట్రాలర్‌పై పాత విమానాన్ని తరలించడాన్ని అందరూ ఆసక్తిగా తిలకిం చారు. మంగళవారం కోల్‌కతా నుంచి చెన్నైకి ట్రాలర్ ట్రక్‌పై పాత విమానాన్ని తీసుకువెళుతుండగా, కొందరు ఫొటోలు తీసుకున్నారు. వినియోగంలో లేని ఈ పాత విమానానికి మరిన్ని హంగులు దిద్ది, హోటల్‌గా తయారుచేస్తారని ట్రక్‌లో ఉన్న వ్యక్తి చెప్పాడు.

పెద్ద రాంభద్రాపురం హైస్కూలులో క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 6 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెదరాంభద్రపురం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కోడి శ్రీనివాస రావు, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ రహమాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభించారు. మంగళవారం బాలికల సీనియర్స్, బాలుర సీనియర్స్‌కు కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బాత్‌రూమ్ ఫొటోల నుంచి విముక్తి హర్షణీయం

టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, తదితరులు

పాడేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బాత్‌రూమ్‌ల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ నుంచి విముక్తి చేయడం హర్షణీయమని టీడీపీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఇక్కడికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించారనే అక్కసుతో ఉపాధ్యాయులను గత ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. అందులో భాగంగానే ప్రతి రోజు టీచర్లతో బాత్‌రూమ్‌ల ఫొటోలను తీయించి యాప్‌లో అప్‌లోడ్ చేయించే ప్రక్రియను ప్రవేశ పెట్టారన్నారు. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, అసంబద్ధంగా వున్న బాత్‌రూమ్ ఫొటోల అప్‌లోడ్ ప్రక్రియ నుంచి టీచర్లకు విముక్తి కలిగించారన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉందన్నారు. అలాగే ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని శ్రావణ్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాకూరు వెంకటరమణ, పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, శశిభూషణ్‌నాయుడు, బుక్కా జగదీశ్, అచ్చిబాబు, త్రినాథ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకుంటేనే పథకాలు

మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు



వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

చింతపల్లి, ఆగస్టు 6: ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వ పథకాలు అందుతాయని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. చౌడుపల్లి, లంబసింగి పంచాయతీ కేంద్రాల్లో సోమవారం ఈ-పంట నమోదుపై రైతులు, వ్యవసాయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ, పీఎం ఫసల బీమా, ధాన్యం కొనుగోలు, బిందు సేద్యం, రాయితీ వ్యవసాయ యంత్రాల పథకాలు అందుతాయన్నారు. 2024 పంట నమోదు కార్యక్రమం సెప్టెంబరు 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. జిరాయితీ, ఆర్‌వోఎఫ్‌ఆర్ వ్యవసాయ భూములలో సాగు చేసిన ప్రతి పంటకు ఈపంట నమోదు చేసే అవకాశం ఉన్నదన్నారు. వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు ప్రతీ రోజు 10-15 ఎకరాల పంటలను నమోదు చేయాలన్నారు. ఈ-పంటలో భాగంగా సాగులోనున్న భూమికి జియో ఫెన్సింగ్ వేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు సావిత్రి, భారతి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పీలా గోవింద

... 5వ పేజీ తరువాయి

ఖరారు చేసినట్టు తెలిసింది.

టీడీపీ కార్యాలయానికి ఏజెన్సీ వైసీపీ ప్రజాప్రతినిధులు

ఏజెన్సీలో వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు మంగళవారం విశాఖపట్నంలోని టీడీపీ కార్యాలయానికి వచ్చారు. తాము పార్టీ మారుతామని, తమ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని టీడీపీ నాయకులను కోరారు. అదే విధంగా మరికొంత మంది నాయకులు బుధవారం వస్తారని సమాచారం.

వైసీపీ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. వారికి రావలసిన నిధులను దారిమళ్లించింది. దాంతో ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు కూడా అధినాయకత్వంపై గుర్రుగా ఉన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలకు పూర్వ అధికారాలు కట్టబెట్టడంతో పాటు 'నీరు-చెట్టు' పథకం కింద నిధులు పంపిణీ చేయడానికి చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఆయా నిధులతో తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి కూటమితో కలసి నడవడానికి ఆసక్తి చూపుతున్నారు. అలా స్వచ్ఛందంగా ముందుకువచ్చే వారిని పార్టీలో చేర్చుకునేందుకు కూటమి నాయకత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు బుధవారం నుంచి పార్టీలో చేరికలు ప్రారంభమవుతాయని టీడీపీ నేతల ద్వారా తెలిసింది. ప్రస్తుతం కూటమి చేతిలో 250 ఓట్లు ఉన్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే 486 ఓట్లు రావాలని చెబుతున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని కచ్చితంగా కూటమే గెలుచుకుంటుందని70 ఓట్ల మెజారిటీ కూడా సాధిస్తుందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

కాగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 838 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం వైసీపీకి 615, కూటమికి 218 ఓట్లు ఉన్నాయి. ఏజెన్సీలో వామపక్షాలకు 18 ఓట్లు ఉన్నాయి. వారు కూటమితో చెలిమికి అంగీకరించారు.

వైద్యులకు వసతి సమస్య తీరేదెన్నడో?

... 5వ పేజీ తరువాయి

మద్యం సీసాలు పేరుకుపోతున్నాయి.

వసతి సమస్యను ఎదుర్కొంటున్న వైద్యులు

చింతపల్లిలో క్వార్టర్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో వైద్యులు వసతి సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది. చింతపల్లి, జీకేవీధి మండలాల పీహెచ్‌సీలు, స్థానిక సీహెచ్‌సీ వైద్యులు చింతపల్లిలో గృహాలను అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. కొంతమంది వైద్యులకు చింతపల్లిలో అద్దె ఇళ్లు లభించక నర్సీపట్నం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న వైద్యుల గృహ సముదాయం అందుబాటులోకి వస్తే ఆరుగురు వైద్యులు కుటుంబంతో నివాసం ఉండే అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైద్యుల వసతి గృహం నిర్మాణాలకు కదలిక వస్తుందని వైద్యులు, ప్రాంతీయులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

గిరిజన విద్యార్థుల సమస్యలపై స్పందించండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్

కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన



సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

పాడేరు రూరల్, ఆగస్టు 6: జిల్లాలో గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యారుల సమస్యలపై స్పందించాలని భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి ఆందోలనకు దిగారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించకపోవడంతో విద్యార్థులు రక్తహీనత, అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ వలంటీర్లను నియమించకపోవడంతో విద్యార్థులకు సరైన వైద్య సేవలు అందక వసతి గృహాల్లో మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు తాగునీటి కోసం రన్నింగ్ వాటర్‌కు తీవ్ర అవస్థలు పడాల్సిన దుస్థితి కనిపిస్తున్నదన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పరీక్ష, ట్యూషన్ తదితర ఫీజులను గతంలో ఐటీడీఏ నుంచి చెల్లించేవారని, ఇప్పుడు ఆ ఫీజులను విద్యార్థులు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. అలాగని ఏ విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు విద్యకు దూరమయ్యే దుస్థితి దాపురిస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీ మెట్రిక్ హాస్టళ్ల మాదిరిగా పోస్టుమెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు రగ్గులు, దుప్పట్లు, కోట్ బుక్‌లు, కాస్మోటిక్స్‌ను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. మెస్ చార్జీలను రూ.2,500కు పెంచి గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, భవనాలను మరమ్మతులు చేయించాలని కోరామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించామని, సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.లక్ష్మణ్, పి.చిన్నబాబు, ఈశ్వర్, సౌజన్య, శ్రీలేఖ, స్వప్న, మంజుల, రాజేశ్వరి పెద్ద ఎత్తున విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుకూల సమయంలో నీడనిచ్చే మొక్కలు నాటాలి



కాఫీ మొక్కల సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న జేఎల్‌వో

చింతపల్లి, ఆగస్టు 6: గిరిజన రైతులు కాఫీ, నీడనిచ్చే మొక్కల నాటుకోవడానికి ఇదే అనుకూల సమయమని కేంద్ర కాఫీ బోర్డు జూనియర్ లైజనింగ్ అధికారి ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని గొందిపాకలు, పిప్పలడొడ్డి గ్రామాల కాఫీ తోటల్లో రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను మంగళవారం వివరించారు. ఈ సందర్భంగా జేఎల్‌వో మాట్లాడుతూ ఈ సీజన్‌లో కొత్త తోటల్లో కాఫీ, నీడనిచ్చే మొక్కలు నాటుకోవాలన్నారు. అలాగే పాత తోటల్లోనూ చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త కాఫీ మొక్కలు, నీడనిచ్చే మొక్కలు నాటుకోవాలని చెప్పారు. తాత్కాలిక నీడనిచ్చే మొక్కలను సైతం నాటుకోవడం మంచిదన్నారు. అలాగే నర్సరీలను అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. కాఫీ మొక్కల్లో కాయలు రాని కొమ్మలు, ఎండు కొమ్మలు, ఎత్తుగాపైకి వచ్చే పిలకలను తొలగించుకోవాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల ఆశించి దిగుబడులు వస్తాయన్నారు. కాఫీ మొక్కలపై శిలీంద్రాలు ఆశించినట్టు గుర్తిస్తే వెంటనే నివారణ చర్యలు ప్రారంభించాలన్నారు. కాఫీ తోటల్లో కలుపును తొలగించుకోవాలని ఆయన సూచించారు. కాలక్రమంగా యాజమాన్య పద్ధతులను రైతులు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని ఆయన వివరించారు.

పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

పాడేరు రూరల్, ఆగస్టు 6: తుఫాన్ ప్రభావంతో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని ఎంపీడీవో కె.సాయి నవీన్ తెలిపారు. జిల్లా కేంద్రం పాడేరులోని పీఎంఆర్సీ ప్రాంతం కొండవాలు ప్రాంతంలో ఉండడంతో వర్షం నీటితో పాటు ఎగువ ప్రాంతంలో ఉన్న చెత్త వచ్చి పేరుకుపోతున్నదని చెప్పారు. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి పంచాయతీ సిబ్బందితో ఆ ప్రాంతాన్ని మంగళవారం పరిశుభ్రం చేయించామన్నారు. అలాగే పట్టణంలో ఉన్న మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నట్టుఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం కావడం వల్ల పట్టణ ప్రజలు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలను పాటించాలని సూచించారు.

గురుకులాల్లో 120 సీట్లకు ఎంపికలు రేపు

పాడేరు రూరల్, ఆగస్టు 6: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో పెంచిన 120 సీట్లుకు గురువారం ఎంపికలు నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీలో 10 సీట్లు, బైపీసీలో 10 సీట్లు, హెచ్‌ఈసీలో 10 సీట్లు, సీజీఏలో 10 సీట్లు, ఏఅండ్‌టీ గ్రూపులో 10 సీట్లు చొప్పున 50 సీట్లు పెంచామన్నారు. అలాగే జీకే.వీధి కళాశాల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులో చేరేందుకు గ్రూపులకు 10 చొప్పున 30, అరకువేలి బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులకు 10 చొప్పున 40 సీట్లు పెంచడం జరిగిందన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి పాడేరులో జరిగే ఈ ఎంపికలకు బాలికలు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

క్షయ నివారణకు కృషి చేయాలి: డాక్టర్ రేఖ

అనంతగిరి, ఆగస్టు 6: క్షయ వ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని టీబీ వైద్యాధికారిని రేఖ కోరారు. మండలంలోని పినకోట పీహెచ్‌సీని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆశ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతీ ఆశ కార్యకర్త ఐదు నమూనాలు సేకరించి తీసుకురావాలని ఆదేశించారు. వారం రోజులు దగ్గు తగ్గకపోతే తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రూప్‌చంద్, ఎంపీహెచ్‌ఈవో గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్పెషల్ డీఎస్సీపై స్పష్టత ఇవ్వాలి'

డుంబ్రిగుడ, ఆగస్టు 6: గిరిజన ప్రత్యేక డీఎస్సీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి.సూర్యనారయణ, ఉపాధ్యక్షుడు పోతురాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గిరిజన విద్యార్థులతో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో శతశాతం ఆదివాసీ, గిరిజనులకే కల్పించాలని గతంలో జీవో నంబర్-3ను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ జీవోను తొలగించడం వల్ల నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. ఈ జీవోను పునరుద్ధరించాలని, స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని వారు కోరారు. అలాగే అన్ని మారుమూల గ్రామాలకు మంచినీటి సదుపాయం కల్పించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని, విద్య, వైద్య వంటి మౌలిక సౌకర్యాలు అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.సురేష్, కుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం.. గిరిజనులకు శాపం

... 5వ పేజీ తరువాయి

రావడంతో ఆ రహదారులు పూర్తవుతాయనే ఆశలో గిరిజనులు ఉన్నారు.

- లోతేరు పంచాయతీ మొర్రిగుడ నుంచి అంటిపర్తి వరకు రెండు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణం నేటికీ కొనసాగుతోంది. ఈ రోడ్డుకు నిధులు మంజూరైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం కొనసాగించకపోవడంతో తారు రోడ్డు ఇంకా పూర్తి కాలేదు.
- లోతేరు నుంచి కాగువలస జంక్షన్ మీదుగా అంటిపర్తికి ఐదు కిలోమీటర్లు, మునిరిగుడ-అంటిపర్తి వరకు 2 కిలోమీటర్ల రహదారుల మట్టి పని, కల్వర్టులు పూర్తి చేశారు. అవసరమైన చోట సీసీ ర్యాంప్‌లు, గ్రావెల్ రోలింగ్ చేయకుండా వదిలేశారు. గత ఐదేళ్ల నుంచి పనులు చేయకపోవడంతో వర్షాలకు మట్టిరోడ్డు పాడైపోయింది.
- ఇరగాయి బొందుగుడ నుంచి వల్దిపనస మీదుగా దవడగుడ వరకు మట్టిరోడ్డును వేసినప్పటికీ కల్వర్టులు, సీసీ ర్యాంప్‌లు, గ్రావెల్ రోలింగ్ పనులు చేపట్టలేదు.
- మాదల పంచాయతీలో సరుబెడ్డ నుంచి పొట్టంగిపాడు వరకు మట్టి పని మాత్రం చేసి కల్వర్టులు, సీసీ ర్యాంప్‌లు, గ్రావెల్ రోలింగ్ పనులు చేయకుండా వదిలేశారు.
- మాదల పంచాయతీలో దోమలజోరు నుంచి రక్తకండి వరకు, రక్తకండి నుంచి కమలతోట, తోటవలస జంక్షన్ నుంచి డాబుగుడ వరకు రహదారి పనులు అర్ధంతరంగా నిలిపివేశారు.
- బొండాం పంచాయతీ బొండాం కొత్తవలస నుంచి బొండాం వరకు రోడ్డు ఫార్మేషన్ మాత్రమే చేపట్టి వదిలేశారు.
- జయంతివలస నుంచి కొల్యాగుడ మీదుగా బొండాం కొత్తవలస వరకు రహదారి పనులు పూర్తికాలేదు.
- ఇలా ప్రతీ పంచాయతీలో పనులు అరకొరగా చేపట్టి వదిలేయడంతో గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా పోయిందని మాదల, బొండాం, లోతేరు పంచాయతీల సర్పంచులు శ్రీనివాసరావు, భాస్కరరావు వాపోయారు. ఎన్డీయే ప్రభుత్వంలో అయినా అర్ధంతరంగా నిలిచిన రహదారులు, వంతెన పనులు పూర్తవుతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమార్

ప్రజారోగ్యంపై శ్రద్ధ తీసుకోండి: డీఎల్‌పీవో

కొయ్యూరు, ఆగస్టు 6: వర్షాకాలంలో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో కుమార్ అధికారులకు ఆదేశించారు. మండలంలోని ఎంపీడీవో సీతయ్య, ఆరోగ్య సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రత, పరిశుభ్రతాలు తప్పక పాటిస్తే డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు అరికట్టవచ్చని సూచించారు. అలాగే తాగునీటి వనరులపై క్లోరినేషన్, స్ప్రేయింగ్ చేయించలన్నారు. దోమతెరలు వినియోగం, పూడిక తీతలు తప్పని సరి అన్నారు. గ్రామ స్థాయిలో ఫాకింగ్ చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు సహకారించాలని ఆయన కోరారు. అలాగే సెప్టెంబరు 6 వరకు శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియామవళి మోడల్ కోడ్ పక్కగా అమలు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్‌కెవి.ప్రసాద్, కార్యాలయ పరిపాలన అధికారి మురళి పాల్గొన్నారు.

కుమ్మరిపుట్టులో భారీ వడగళ్లు



భారీ వడగళ్లు ఇవే..

ముంచంగిపుట్టు, ఆగస్టు 6: మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో మంగళవారం భారీ సైజులో వడగళ్లు పడ్డాయి. వివరాల్లోకి వెళితే కుమ్మరిపుట్టు గ్రామానికి చెందిన పశువుల కాపరి రమేష్ పశువులను మోత కోసం ఆ గ్రామానికి సమీపంలో గల కొండ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఆ సమయంలో భారీ వర్షం కురుస్తుండటంతో అతను ఒక చెట్టు దగ్గర తలదాచుకొనేందుకు వెళ్లాడు. అదే సమయంలో భారీ శబ్దంతో ఏదో క్రింద పడినట్లు అయింది. రమేష్ అకక్కడికి వెళ్లి చూడగా భారీ సైజ్‌తో వడగళ్ల గడ్డ ముక్కలు కనిపించాయి. సుమారు పది కిలోల ఉండే వడగళ్ల గెడ్డ కింద పడటంతో ముక్కలై ఉండొచ్చునని ఆయన తెలిపారు. వాటిని ఒక సంచిలో పెట్టి గ్రామానికి తీసుకువచ్చి ప్రజలకు వివరించారు. దాన్ని చూసిన వారంతా ఆశ్చర్యానికి గురయ్యారు. కింద పడి ముక్కలైన ఐస్ టీడియో, ఫోటోలను తీసి వారు సోషల్ మీడియాలో పెట్టడంతో మారింది.

పార్శిల్ సిబ్బంది ఆదాయాభివృద్ధికి కృషి

పీటీడీ జోన్-1 డిప్యూటీ సీటీఎం అప్పలనారాయణ



పార్శిల్ సిబ్బంది, హమాలీలతో మాట్లాడుతున్న సీటీఎం అప్పలనారాయణ

పాడేరు రూరల్, ఆగస్టు 6: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో పీటీడీ పార్శిల్ సిబ్బంది, హమాలీల ఆదాయాభివృద్ధికి కృషి చేస్తామని విజయనగరం జోన్-1 డిప్యూటీ సీటీఎం బి.అప్పలనారాయణ హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక డిపోను సందర్శించిన ఆయన ముందుగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన పార్శిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్శిల్ కార్యాలయ సిబ్బందితో పాటు బస్టాండ్‌లో పనిచేస్తున్న హమాలీలు ఆర్థికంగా ఆదాయాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. డిపో మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ డిపోను అభివృద్ధి పదంలో నడిపిస్తామని అందుకు సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ హనుమశ్రీ, ట్రాఫిక్ సూపరిండెండెంట్ ఆర్‌వీ.రావు, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

జామిగూడ-గుంజివాడ వంతెన నిర్మించాలని నిరసన



జామిగూడ గెడ్డలో నిరసన తెలుపుతున్న నాయకులు

పెదబయలు, ఆగస్టు 6: జామిగూడ పంచాయతీలోని మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గెడ్డలో దిగి నిరసన తెలిపారు. కోట్లాది రూపాయలతో మంజూరైన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఈ సందర్భంగా ఆయన వాపోయారు. దీంతో 80 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నేతలు ధర్మన్నపడాల్, సన్నిబాబు, నర్సయ్య, బుజ్జిబాబు, మంగ్లన్న పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఘాట్‌లో చెట్టు కొమ్మల తొలగింపు

పాడేరు రూరల్, ఆగస్టు 6: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో పాడేరు ఘాట్ మార్గంలో నడిచే వాహనాలకు ప్రమాదభరితంగా మారిన చెట్టు కొమ్మలను ఆర్అండ్‌బీ, పీటీడీ శాఖల సిబ్బంది మంగళవారం తొలగించినట్టు పీటీడీ డీఎం వి.శ్రీనివాస్ తెలిపారు. పాడేరు ఘాట్ మార్గంలో రాజాపురం నుంచి పాడేరు వరకు పెరిగిన, విరిగిన, వేలాడిన చెట్టుకొమ్మలు ప్రధాన రహదారిపై నడిచే వాహనాలకు ప్రతిబంధకంగా, ప్రమాదకరంగా ఉండడంతో తొలగించినట్టు చెప్పారు. అన్ని మలుపుల్లో చెట్టు కొమ్మలను తొలగించడంతో డ్రైవర్లకు సులభతరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ జేఈ వి.నాగేంద్ర, పీటీడీ డిపో కంట్రోలర్ టి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలి

పాడేరు రూరల్, ఆగస్టు 6: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర కోరారు. ఐక్యరాజ్య సమితి (యూఎన్) ప్రకటించినప్పటి నుంచి ప్రతీ ఏటా ఆగస్టు 9వ తేదీన ఆదివాసీ దినోత్సవం జరుపుకుంటున్నట్టు చెప్పారు. ఈ వేడుకలను ప్రభుత్వాలు కూడా అధికారికంగా నిర్వహిస్తున్నాయన్నారు. వేడుకల దినాన్ని సెలవు దినంగా ప్రకటించకపోవడంతో వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, విద్యార్థులు సంబరాల్లో పాల్గొనలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలకు ఆగస్టు 9వ తేదీని అధికారికంగా సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జీఎస్‌యూ నాయకులు బి.అనీల్‌కుమార్, బుడిదే మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జయ్యకు ఘన నివాళి

పాడేరు రూరల్, ఆగస్టు 6: బీజేపీ గిరిజన మోర్చ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కురసా బొజ్జయ్య వర్ధంతిని కొత్తపాడేరులో మంగళవారం నిర్వహించారు. బొజ్జయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బీజేపీని గిరిజన ప్రాంతంలో విస్తరణ చేసేందుకు, కాఫీ ప్లాంటేషన్ అభివృద్ధికి కేంద్ర కాఫీ బోర్డు సభ్యునిగా విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చ అధ్యక్షులు కురసా ఉమామహేశ్వరరావు, కురసా పార్వతమ్మ, జనసేన పార్టీ అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, నాయకులు కూడా కృష్ణారావు, పెనుమాక రవికుమార్, వి.రామచందర్, గోపాలపాత్రుడు, ఎస్.ఉమామహేష్, కె.ఆనంద్ కురసా రాజారావు, పాపిటిరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



గూడెంకొత్తవీధి, ఆగస్టు 6: ద్విచక్ర వాహనం ఇంజన్ నుంచి మంటలు రావడంతో వాహనం దగ్ధమైంది. మండలంలోని బోనంగిపల్లి గ్రామం నుంచి వంతల కోటి ద్విచక్ర వాహనంపై సోమవారం ఆర్వీనగర్ వారపు సంతకు ప్రయాణమయ్యాడు. ఆర్వీనగర్ సమీపంలో ఒక్కసారిగా ఇంజన్ నుంచి మంటలు వచ్చాయి. దీంతో వాహనం పక్కన నిలిపివేసి కోటి తప్పుకున్నాడు. మంటలు వాహనం చుట్టూ ఎగబాకి పూర్తిగా కాలిపోయింది. అయితే వాహనంలో ప్రయాణిస్తున్న కోటికి ఎటువంటి హాని కలగలేదు.

పంచాయతీ పరిశుభ్రంగా లేకపోతే ఉపేక్షించేది లేదు

అనంతగిరి, ఆగస్టు 6: పంచాయతీలను స్వచ్ఛత ఉంచే బాధ్యత కార్యదర్శులదేనని, ఈవోపీఆర్డీ తోటరావు సూచించారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలోని పారిశుధ్యం పనులను మంగళవారం పర్యవేక్షించారు. అనంతరం చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. చెత్తసంపద కేంద్రాల ద్వారా పంచాయతీకి వచ్చే ఆదాయం దృష్టిపెట్టాలని, ఆదేశించారు. ప్రతి పంచాయతీలో పర్యటిస్తానని, పారిశుధ్య పక్షోత్సవాలు నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. పారిశుధ్యం మెరుగునకు మండలానికి మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలోని కార్యదర్శి వరలక్ష్మి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

అనంతగిరి, ఆగస్టు 6: పాడి రైతులకు రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కల్పించాలని కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు, దేవరాపల్లి యూకో బ్యాంక్ అధికారులను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మార్చి నెలలో రుణాలు మంజూరుకు దరఖాస్తులు చేసుకున్న రైతులకు నేటికి ఒక్క రుణం కూడా మంజూరు కాలేదన్నారు. సన్న జీవాల పోషకులకు ప్రధానమంత్రి పశు కిషన్ క్రెడిట్ కార్డు రుణాలు, ఔత్సాహిక పాడి రైతులకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలోని రుణాలు మంజూరు చేయాల్సి ఉందని, దీనిపై బ్యాంక్ అధికారులు స్పందించి రైతులకు రుణాలను మంజూరుచేస్తే ఆర్థికంగా ఎదిగేందుకు ఆస్కారం ఉందని వినతిలో కోరారు.

భీమవరం మావుళ్లమ్మకు జేసీ అభిషేక్ పూజలు



జేసీ అభిషేక్‌కు ప్రసాదాలు అందిస్తున్న అధికారులు

భీమవరం టౌన్, ఆగస్టు 6: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని మావుళ్లమ్మకు అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ వి.అభిషేక్ దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున శేషవస్త్రాన్ని ప్రసాదాన్ని అందించారు.